AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH. TRUST. TREND

WWW.AKSHARATODAYNEWS.COM

11-7-2026 (Saturday) MAIN EDITION

## జోగిపేటలో ఉద్రిక్తత



**అక్షరటుడే, సంగారెడ్డి:** సంగారెడ్డి జిల్లా జోగిపేటలో ఉద్రిక్తత చోటు చేసుకుంది. బీఫ్ దుకాణాల ఏర్పాటు విషయంలో ఆందోల్, జోగిపేట ముస్లిం వ్యాపారుల మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో ఇరువర్గాల వారు రాళ్లు, కర్రలు, కత్తులతో దాడి చేసుకున్నారు. ఈ ఘటనలో జోగిపేటకు చెందిన పలువురు ముస్లింలకు తీవ్రగాయాలు అయ్యాయి. చికిత్స కోసం ఆస్పత్రికి వచ్చిన బాధితులపై మరోసారి ఆందోల్ వర్గం దాడి చేసింది. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని ఇరు వర్గాలను చెదరగొట్టారు.

## ప్రతి వర్షపు చుక్కను ఒడిసిపట్టాలి

**అక్షరటుడే, హైదరాబాద్:** హైదరాబాద్ నగరంలో పెరుగుతున్న తాగునీటి అవసరాలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ప్రతి అపార్ట్‌మెంట్, గేటెడ్ కమ్యూనిటీ వర్షపు నీటి సంరక్షణను తప్పనిసరి బాధ్యతగా స్వీకరించాలని జలమండలి ఎండీ అశోక్ రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం గుట్టల బేగంపేటలోని బీవర్లీ హిల్స్ లోని బీవర్లీ స్ప్రింగ్ అపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో పునర్నిర్మించిన మూడు ఇంకుడు గుంతలను, మరో ఇంకుడు గుంతను డ్రిల్లింగ్ చేసి ఇంజెక్షన్ బోర్‌గా మార్చిన రీచార్జ్ వ్యవస్థను ప్రారంభించారు. ప్రతి భవనం పైకప్పుపై కురిసే వర్షపు నీటి ప్రతి చుక్కను అదే ప్రాంగణంలో భూమిలోకి ఇంకేలా శాస్త్రీయంగా రూఫ్‌టాప్ రేన్‌వాటర్ హార్వెస్టింగ్ వ్యవస్థలు, ఇంకుడు గుంతలు, రీఛార్జ్ పిట్లు నిర్మించాలని సూచించారు.

## తాగునీటి సరఫరాకు అంతరాయం



అక్షరటుడే, హైదరాబాద్ : హైదరాబాద్ నగరానికి తాగు నీరు అందించే లింగంపల్లి – బంజారాహిల్స్ మార్గంలో ఉన్న 1,000 మి.మీ. గోదావరి తాగునీటి ప్రాజెక్టు పైప్‌లైన్‌లో భారీ లీకేజీని అధికారులు గుర్తించారు. యుద్ధ ప్రతిపాదికన మరమ్మతులు చేపట్టారు. పనులతో తాగునీటి సరఫరాలో అంతరాయం ఉంటుందని అధికారులు తెలిపారు.

## కాళేశ్వరంపై మంత్రి పొన్నం కీలక వ్యాఖ్యలు



అక్షరటుడే, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై మంత్రి పొన్నం ప్రభాకర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రాజెక్టు పూర్తిగా విఫలమై, కళ్లముందే కూలిపోతున్నా ప్రతిపక్షాలు ఇంకా బుద్ధి లేకుండా రాజకీయం చేస్తున్నాయని మండిపడ్డారు. నిపుణులు పనులు ఆపమంటున్నా, మూడు నెలల్లో నీళ్లు తెస్తామని ప్రకటనలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## కాంగ్రెస్ ప్రభుత్వానికి కౌంట్ డౌన్ స్టార్ట్





అక్షరటుడే, ఖమ్మం: కాంగ్రెస్ ప్రభుత్వానికి కౌంట్‌డౌన్ స్టార్ట్ అయిందని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. బాయి బాట కార్యక్రమంలో భాగంగా సత్తుపల్లిలో ఆమె పర్యటించారు. సింగరేణి కార్మికులతో మాట్లాడారు. డిపెండెంట్ ఎంప్లాయ్‌మెంట్ సమస్యపై ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలన్నారు.

## పవన్ కల్యాణ్‌కు ఆపరేషన్ విజయవంతం



**అక్షరటుడే, ఏపీ:** ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు ఆపరేషన్ విజయవంతం అయింది. ఆయన రెండు భుజాలకు రొటేటర్ కఫ్ ఇంజ్యూరీస్ కాగా.. తొలుత కుడి భుజానికి శస్త్ర చికిత్స చేశారు. పవన్ కల్యాణ్‌కు 2016లో తగిలిన గాయాలకు తోడు, పోరాట యాత్ర నుంచి గత ఎన్నికల ప్రచారం వరకూ పార్టీ శ్రేణులు, అభిమానులు చేతులుపట్టి లాగడంతో రొటేటర్ కఫ్ ఇంజ్యూరీస్ అయ్యాయి. ఇటీవల వైద్య పరీక్షలు నిర్వహించగా.. వీలైనంత త్వరగా ఆపరేషన్ చేయాలని వైద్యులు సూచించారు. ఈ క్రమంలో శనివారం వైద్యులు మూడున్నర గంటల పాటు ఆపరేషన్ చేశారు.



# ‘పోక్సో’ నిందితుడి కిరాతకం

■ దారుణంగా ఆరుగురి హత్య ■ భార్య పిల్లలనూ చంపిన వైనం ■ పరారీలో నిందితుడు ■ ప్రత్యేక బృందాలతో గాలిస్తున్న పోలీసులు

“ తనపై పోక్సో కేసు పెట్టారని ఓ వ్యక్తి ఆ కుటుంబంపై కక్ష పెంచుకున్నాడు. వారిని ఎలాగైనా అంతం చేయాలని భావించాడు. ఈ మేరకు బెయిల్ మీద జైలు నుంచి బయ టకు వచ్చాడు. అనంతరం అర్ధరాత్రి తనపై పోక్సో కేసు పెట్టిన బాలిక ఇంటికి వెళ్లాడు. ఆమెను బలవంతంగా అక్కడి నుంచి తీసుకెళ్లడానికి యత్నించాడు. అడ్డుకోబోయిన బాలిక తల్లి, నాయనమ్మను దారుణంగా హత్య చేశాడు. అనంతరం బాలికను సైతం చంపాడు. తర్వాత తన ఇంటికి వెళ్లి భార్య, పిల్లలను సైతం అతికిరాతకంగా హత్య చేశాడు. రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం దైవాలగూడలో జరిగిన ఈ ఆరు హత్యలు రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర కలకలం సృష్టించాయి. - అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి

షాబాద్ మండలం దైవాలగూడకు చెందిన పార్వతి రాజ్‌కుమార్ (28) గతంలో ఓ బాలికను వేధించాడు. దీంతో ఆమె తల్లి మే 16న పోలీసులకు ఫిర్యాదు చేసింది. మే 26న నిందితుడిని పోలీసులు రిమాండ్ చేశారు. తనను జైలుకు పంపారనే కోపంతో రాజ్‌కుమార్ వారిపై కోపం పెంచుకున్నాడు. వారిని హత్య చేస్తానని గతంలో బెదిరించినట్లు స్థానికులు ఆరోపించారు. ఈ మేరకు ఇటీవల రూ.20 వేల పూచీకత్తుతో బెయిల్‌పై బయటకు వచ్చాడు.

### రెండు గంటల్లో..

రాజ్‌కుమార్ రెండు గంటల వ్యవధిలో ఆరుగురిని హత్య చేశాడు. శుక్రవారం రాత్రి 11 గంటల నుంచి ఒంటి గంట వరకు ఈ నరమేధం సాగింది. తొలుత బాలిక ఇంటికి వెళ్లిన రాజ్‌కుమార్.. ఆమెను బలవంతంగా లాక్కెళ్లేందుకు యత్నించాడు. బాలిక తల్లి, నాయనమ్మ అడ్డుకోగా.. వారిపై కత్తితో దాడి చేసి హత్య చేశాడు. అనంతరం బాలికను కారులో తీసుకెళ్లి హత్య చేశాడు. అనంతరం మళ్లీ గ్రామానికి వచ్చిన నిందితుడు తన భార్య సరితకు ఫోన్ చేశాడు. పిల్లలను చూడాలని ఉందని చెప్పాడు. దీంతో తలుపు తీసిన ఆమెపై దాడి చేశాడు. బయటకు పరుగు తీసిన ఆమెను ఇంట్లోకి తీసుకెళ్లి మరి హత్య చేశాడు. అనంతరం అభం శుభం తెలియని తన ఇద్దరు కుమారులు పరీక్షిత్, రుద్రవంశను చంపేశాడు.

### తండ్రికి ఫోన్ చేసి..

నిందితుడు ఆరుగురిని చంపిన తర్వాత తన తండ్రికి ఫోన్ చేశాడు. హత్యలు చేసినట్లు చెప్పి.. తాను కూడా ఆత్మహత్య చేసుకుంటానన్నాడు. అనంతరం ఫోన్ స్విచ్‌ఆఫ్ చేశాడు. దీంతో రాజ్‌కుమార్ తండ్రి వెంటనే పోలీసులకు సమాచారం అందించాడు. అయితే అప్పటికే రాజ్‌కుమార్ పరారు అయ్యాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. క్లూస్ టీమ్‌తో ఆధారాలు సేకరించారు.

### స్థానికుల ఆందోళన


రాజ్‌కుమార్‌ను తమకు అప్పగించాలని దైవాలగూడ గ్రామస్తులు షాబాద్ పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన చేశారు. నిందితుడిని వెంటనే అరెస్ట్ చేయాలని, లేకపోతే మరొకరిని హత్య చేస్తారని పేర్కొన్నారు. పోలీసుల నిర్లక్ష్యంతోనే ఈ హత్యలు జరిగాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో నిందితుడు బాలికను చంపుతానని బెదిరించాడని పేర్కొన్నారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. ఫ్యూచర్ సిటీ సీపీ తరుణ్ జోషి ఘటన స్థలాన్ని పరిశీలించారు. ఏడు బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

## యూపీఐతో న్యూజిలాండ్ ‘ఫాస్ట్ పేమెంట్’ అనుసంధానం : ప్రధాని



**అక్షరటుడే, నేషనల్ డెస్క్ :** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ న్యూజిలాండ్ పర్యటన కొనసాగుతోంది. ఇరు దేశాలు బహుళ రంగాలలో ద్వైపాక్షిక సంబంధాలను విస్తరిస్తున్నాయని మోదీ శనివారం ప్రకటించారు. భారతదేశపు యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్‌ను న్యూజిలాండ్ ఫాస్ట్‌పేమెంట్ నెట్‌వర్క్‌తో అనుసంధానించే ఒక ప్రధాన డిజిటల్ ఏకీకరణ కూడా ఉందని మోదీ తెలిపారు. ఆక్లాండ్‌లో న్యూజిలాండ్ ప్రధానమంత్రి క్రిస్టోఫర్ లక్సన్ తన గౌరవార్థం ఏర్పాటు చేసిన గాలా లంచ్‌లో ఆయన మాట్లాడారు. డిజిటల్ టెక్, వ్యవసాయం, విద్య, సాంప్రదాయ వైద్య రంగాలలో రెండు దేశాలు తమ ప్రత్యేకమైన బలాలను ప్రపంచ ద్వైపాక్షిక పురోగతిగా విజయవంతంగా మారుస్తున్నాయని ప్రధాని మోదీ పేర్కొన్నారు. వ్యవసాయం, పాడి, ఆహార ప్రాసెసింగ్‌లో సహకారం కోసం ఒక బలమైన ఫ్రేమ్‌వర్క్‌ను అభివృద్ధి చేశాశామన్నారు.

## 1000 మిసైళ్లు రెడీగా ఉన్నాయి: ట్రంప్




**అక్షరటుడే, నేషనల్ డెస్క్ :** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ఇరాన్-అమెరికా పరసర్పం దాడులు చేసుకుంటున్నాయి. ఈ క్రమంలో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ టెహ్రాన్‌కు హెచ్చరికలు జారీ చేశారు. వారు తనను చంపాలనుకుంటే క్షిపణుల వర్షం తప్పదని హెచ్చరించారు. సుప్రీం లీడర్ అయతోల్లా అలీ ఖమేనీ అంత్యక్రియల సందర్భంగా ట్రంప్‌ను చంపాలంటూ బహిరంగంగా పిలుపులు రావడంతో, శనివారం డొనాల్డ్ ట్రంప్ స్పందించారు. ఇరాన్ ప్రభుత్వం తన బెదిరింపును ఆచరణలో పెడితే, ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్‌పై 1000 క్షిపణులు గురిపెట్టి సిద్ధంగా ఉన్నాయి, వెంటనే మరిన్ని వేల సంఖ్యలో వాటిని అనుసరిస్తాయి అని పోస్ట్ చేశారు.

## హరీశ్‌రావుపై పోటీ చేస్తా: జగ్గారెడ్డి




**అక్షరటుడే, సంగారెడ్డి :** మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. తాను సంగారెడ్డి నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేయనని ప్రకటించారు. అక్కడ తన భార్య నిర్మల పోటీ చేస్తుందని తెలిపారు. తాను ఎన్నికల్లో పోటీ చేయను అనడం లేదన్నారు. పార్టీ ఆలోచన బట్టి నేను నడుచుకుంటానని తెలిపారు. అధిష్టానం ఆదేశిస్తే హరీష్‌రావుపై పోటీ చేస్తానని ప్రకటించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆట మొదలు పెట్టారని అన్నారు. 117 సీట్లు గెలిపించుకునే ప్లాన్ చేశారన్నారు. ఆయన వ్యూహాలు, నిర్ణయాలకు తమ మద్దతు ఉంటుందని చెప్పారు. సీట్లు ఎవరికి ఇవ్వాలనే అంశం సీఎం, పీసీసీ చీఫ్, ఇంచార్జ్ నిర్ణయాన్ని బట్టి ఉంటుందని వెల్లడిచారు.

## మండుతున్న ఎండలు..



**అక్షరటుడే, హైదరాబాద్ :** రాష్ట్రంలో ఎండలు మండుతున్నాయి. వానాకాలంలో రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో వర్షాలు పడటం లేదు. మొన్నటి వరకు వానలు లేకున్నా.. వాతావరణం చల్లగా ఉంది. అయితే శుక్రవారం నుంచి ఎండ తీవ్రత పెరిగింది. ఈ నెల 15 వరకు ఉష్ణోగ్రతలు పెరుగుతాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా శనివారం వాతావరణం పొడిగా ఉండనుంది. తూర్పు తెలంగాణలో 37 నుంచి 39 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు అవుతాయి. ఉత్తర తెలంగాణలో 35 నుంచి 37 డిగ్రీల ఎండతీవ్రత ఉంటుంది. 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంగా గాలులు వీస్తాయి. ఆదివారం ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉంది.

## ఫిన్లాండ్‌లో భారత విద్యార్థి మృతి



**అక్షరటుడే, నేషనల్ డెస్క్ :** ఫిన్లాండ్‌లో అదృశ్యమైన భారత విద్యార్థి మృతి చెందాడు. హైదరాబాద్ హయత్‌నగర్‌కు చెందిన మణిదీప్ ఉన్నత చదువుల కోసం ఫిన్లాండ్ వెళ్లాడు. మే 6 నుంచి అతడు కనిపించడం లేదు. దీంతో అక్కడి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ క్రమంలో శనివారం మణిదీప్ మృతదేహాన్ని సముద్రంలో గుర్తించినట్లు అధికారులు తెలిపారు. ఈ ఘటనలో ఎలాంటి నేర అనుమానాలు లేవని పేర్కొన్నారు.

## సీఎం వెంటనే రాజీనామా చేయాలి : ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్



**అక్షరటుడే, రంగారెడ్డి :** రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం దైవాలగూడలో పోక్సో కేసులో నిందితుడు ఆరుగురిని హత్య చేసిన విషయం తెలిసిందే. బాధితులను పరామర్శించడానికి వెళ్తున్న బీఆర్ఎస్ నాయకులు సబితా ఇంద్రారెడ్డి, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, పట్నం నరేందర్ రెడ్డిలను పోలీసులు అరెస్ట్ చేశారు. శంకర్‌పల్లి వద్ద ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, పట్నం నరేందర్ రెడ్డిని అదుపులోకి తీసుకొని ఠాణాకు తరలించారు. స్టేషన్‌లో ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. హోం మంత్రిగా ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి పూర్తిగా విఫలం అయ్యారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తమను అరెస్ట్ చేయకుండా నిందితుడిని అరెస్ట్ చేయాలన్నారు. సభలతో ప్రజాధనం వృథా చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి హోంశాఖపై దృష్టి పెట్టాలని సూచించారు.

## ఇది కాంగ్రెస్ తెచ్చిన కరువు : కేటీఆర్





**అక్షరటుడే, హైదరాబాద్:** ఇది కాలం తెచ్చిన కరువు కాదని, కాంగ్రెస్ తెచ్చిన కరువు అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఎల్‌నినో ప్రభావంతో ఎక్కడా నీళ్లు లేకపోయినా కన్నెపల్లిలో మాత్రం ఉన్నాయన్నారు. తమ మీద కోపంతో రేవంత్‌రెడ్డి నీళ్లు ఉన్నా కూడా ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మేడిగడ్డను ముట్టకుండా కన్నెపల్లి నుంచి అన్నారం, సుందిళ్ల, ఎల్లంపల్లి, మిడ్ మానేరు అన్ని జలాశయాలు నింపొచ్చని కేటీఆర్ అన్నారు. తమ మీద కక్షతో రైతుల నోట్లో మట్టి కొట్టొద్దని కోరారు. మేడిగడ్డ గేట్లు మూసివేయకుండానే కన్నెపల్లి పంప్ హౌస్ నుంచి నీళ్లు లిఫ్ట్ చేయవచ్చు అని రిటైర్డ్ ఇంజనీర్ల ఫోరం ప్రభుత్వానికి లేఖ రాసిందన్నారు. కన్నెపల్లి వద్ద ప్రస్తుతం 96.79 మీటర్ల నీళ్లు ప్రవహిస్తున్నాయన్నారు. మరో 100 రోజులు కన్నెపల్లి వద్ద ఇదే తరహా ప్రవాహం ఉంటుందని కేటీఆర్ తెలిపారు.